

లచ్చమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

బీఆర్ఎస్ నాయకుడికి ప్రముఖుల పరామర్శ

చందంపేట, జనవరి 17 : బీఆర్ఎస్ పార్టీ చందంపేట మండలాధ్యక్షుడు ముత్యాల సర్వయ్య తల్లి లచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ బుధవారం కంబాలపల్లి గ్రామంలోని సర్వయ్య ఇంటికి వెళ్లి లచ్చమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, పీఏపల్లి ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, నాయకులు గుత్తా అమిత్‌రెడ్డి, నేనావత్ కిషన్‌నాయక్, రవి, టీవీఎన్.రెడ్డి, గోవిందుయాదవ్, మేకల శ్రీనివాస్‌యాదవ్, ముచ్చర్ల ఏడుకొండలు, శంకర్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, రాములు, గిరి, పరమేశ్, చంద్రశేఖర్, ముత్యాల రవి, నాయకులు ఉన్నారు.



సర్పంచులు, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎంపీపీ భగవాన్‌నాయక్

గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

● ఎంపీపీ భగవాన్‌నాయక్

తిరుమలగిరి(సాగర్), జనవరి 17: రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పని చేయాలని సూచించారు. అనంతరం తమ గ్రామాల సమస్యలను సర్పంచులు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలం ఏర్పాటై ఎనిమిది సంవత్సరాలు గడిచినా నేటికీ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం జరుగలేదని, మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డు ఖాళీ స్థలంలో కార్యాలయాలకు భవనాలు నిర్మించాలని ఎంపీటీసీలు, సర్పంచులు ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం సర్పంచులు, ఎంపీటీసీలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజాఅజ్గర్‌అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ సభ్యుడు రహీం, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



జయశంకర్‌సార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

జయశంకర్ సార్ విగ్రహాన్ని కూల్చిన వారిని శిక్షించాలి

● బీసీ సంఘం నాయకులు

మిర్యాలగూడ, జనవరి 17: హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లిలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని కూల్చిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ నాయకులు కోల సైదులు, మహేశ్‌గౌడ్, దాసరాజు జయరాజు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద జయశంకర్ సార్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుకు దశ దిశ చూపిన మేధావి విగ్రహం కూల్చడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ ఏర్పాటులో జయశంకర్ సార్ పాత్ర మరువలేనిదన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సుధాకర్, సీహెచ్. వెంకటేశ్వర్లు, ఈశ్వరాచారి, ఏడుకొండలు, బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథనాయక్, మోసీన్ అలీ, మురళి, బంటు కవిత, నాయకులు పాల్గొన్నారు.

భూములు సాగు చేసుకోనివ్వాలని పోడు రైతుల నిరసన

చందంపేట, జనవరి 17 : మండలంలోని గువ్వలగుట్ట ప్రాంతంలో తాము సాగు చేస్తున్న భూముల్లో బోరు వేయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన పలువురు పోడు రైతులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. తమకు గత ప్రభుత్వం అందించిన పట్టాలతో వారు నిరసన తెలిపారు. ప్రభుత్వం తమకు పట్టాలు ఇచ్చిన భూముల్లోనే పంటలు సాగు చేసుకుంటున్నామని, అధికారులు తమను ఇబ్బంది పెట్టకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

పేరు మార్పు
★ మైలారుసేట్టి వేంకటేశ్వర్లు, S/o. మైలారుసేట్టి రామయ్య, H.No. 1-205, చెన్నాయిపాలెం, త్రిపురారం (మం), నల్లగొండ, తెలంగాణ-508 355. నా పేరును మైలారుశెట్టి వేంకటేశ్వర్లు, S/o. మైలారుశెట్టి రామయ్యగా మార్చనైనది.
NT-00000

పేరు మార్పు
★ మైలారుసేట్టి సరిత, W/o. మైలారుసేట్టి వేంకటేశ్వర్లు, H.No. 1-205, చెన్నాయిపాలెం, త్రిపురారం (మం), నల్లగొండ, తెలంగాణ-508 355. నా పేరును మైలారుశెట్టి సరిత, W/o. మైలారుశెట్టి వేంకటేశ్వర్లుగా మార్చనైనది.
NT-00000

SSC మెమో పోయినది
★ నేను అనగా అహ్మద్ అయాన్ హుస్సేన్, S/o. అహ్మద్ ఇమ్రాన్ హుస్సేన్, R/o. H.No. 3-5-18, మూసా స్ట్రీట్, నల్లగొండ టౌన్ & మండలం, నల్లగొండ జిల్లా. నేను నల్లగొండ పట్టణంలోని R.P.రోడ్ యందు ప్రయాణిస్తుండగా నా యొక్క ఒరిజినల్ SSC మెమో (Roll No. 1626600610) పోయినది. దొరికినవారు సంప్ర॥: 9966074688.
NT-00000

WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All

కావలెను
★ మన పట్టణంలో కొత్తగా స్థాపించిన బ్రాంచ్ నందు పని చేయుటకు ఇంటర్, డిగ్రీ, బి.టెక్, PG చదివిన అభ్యర్థులు కావలెను. వర్క్ ఫ్రం హోం కలదు. సెల్: 9640248588, 9365043965.
NTW-323056

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిక్ బాక్సులు, (గ్రా పంచాయతీ, మండ నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | కొండమల్లేపల్లి : 9182777030 | మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777030 | హుజూర్‌నగర్ : 9182777030

కల్యాణలక్ష్మితో పేద కుటుంబాలకు ఆసరా

● ఎమ్మెల్యే బాలూనాయక్



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

కొండమల్లేపల్లి, జనవరి 17 : కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం ఆడపిల్లలున్న పేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నదని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. దేవరకొండ నియోజకవర్గానికి చెందిన 88 మందికి లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం దేవరకొండలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయనున్నదని పేర్కొన్నారు. అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం అందిస్తుందని తెలిపారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవ్వరూ దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీరాములు, ఎంపీపీలు దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి, నల్లగాసు జాన్ యాదవ్, వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, జాల నర్సింహారెడ్డి, దూదిపాల వేణూధర్‌రెడ్డి, ఎంఏ సిరాజ్‌ఖాన్, ధనలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్లు, వివిధ మండలాల తాసీల్దార్లు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాపన్న విగ్రహ గద్దెను కూల్చిన వారిని శిక్షించాలి

● గీత సంఘాల సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ చింతపల్లి శ్రీనివాస్

కొండమల్లేపల్లి, జనవరి 17 : జనగాం జిల్లా తరిగొప్పుల మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు కోసం నిర్మించిన గద్దెను కూల్చిన దుండుగులను కఠినంగా శిక్షించాలని గౌడ, గీత సంఘాల సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అదే స్థానంలో బహుజన ఉద్యమ కారుడైన సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు.

బాలకార్మికుడికి విముక్తి

మిర్యాలగూడ రూరల్, జనవరి 17 : ఇటుకలు తయారీ కంపెనీలో పని చేస్తున్న బాలకార్మికుడికి బుధవారం ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా పోలీసులు విముక్తి కల్పించారు. మండలంలోని వెంకటాద్రి పాలెం గ్రామ శివారులో వెంగమాంబ బ్రిక్స్ తయారీ యూనిట్‌లో బాలుడు (16) పని చేస్తున్నట్లు గుర్తించిన ఎస్ఐ శోభన్ విచారణ చేపట్టారు. బాలుడికి విముక్తి కల్పించడంతో పాటు బాల కార్మికుడిని పనిలో పెట్టుకున్న కంపెనీ యజమాని రాజేశ్‌పై కేసు నమోదు చేనట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన వెంట రూరల్ ఎస్ఐ దొరేపల్లి నర్సింహులు ఉన్నారు.

రోహిత్ వేములకు నివాళి

రామగిరి, జనవరి 17: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వివక్షకు ఎదురొడ్డి నిలిచిన ఉద్యమ కెరటం రోహిత్ వేముల వర్ధంతిని బుధవారం నల్లగొండలోని గడియారం సెంటర్ వద్ద నిర్వహించారు. రోహిత్ చిత్రపటానికి కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, తెలంగాణ విద్యా వంతుల వేదిక రాష్ట్ర నాయకుడు పందుల సైదులు నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గాదె నర్సింహ, బట్టు నవీన్, పోతేపాక నవీన్, కిరణ్ పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడి విగ్రహం ధ్వంసం

కట్టంగూర్, జనవరి 17: మండలంలోని అయిటిపాముల పంచాయతీ పరిధిలోని గంగాదేవిగూడెంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కొమ్ము సత్తయ్య విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన కొమ్ము యాదయ్య గ్రామ స్టేజీ వద్ద బస్ షెల్టర్ నిర్మించి అందులో తన తండ్రి సత్తయ్య జ్ఞాపకార్థం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహం తలను ధ్వంసం చేశారు. విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బుధవారం పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు యాదయ్య తెలిపారు.

ఎల్ ఓసీ అందజేత



ఎల్ఓసీ అందిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల, జనవరి 17 : మండలంలోని పెద్దకాపర్తికి చెందిన మంత్రి సుమలత అనారోగ్యంతో చికిత్స పొందుతున్నది. ఆమెకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 3 లక్షల ఎల్ఓసీని ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాటం వెంకటేశం,గుడిపాటి లక్ష్మీనర్సింహ, నూతి సత్యశ్రీ, జడల చినమల్లయ్య, వెంకటేశం, సాగర్ల నాగరాజు పాల్గొన్నారు.



సన్మానం పొందిన సర్పంచులు, ఎంపీటీసీలతో ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి

గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలి

● ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి

మాడ్గులపల్లి, జనవరి 17: గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి కేంద్రీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోకల శ్రీవిద్యారాజు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు సర్పంచులు, ఎంపీటీసీలు తమ గ్రామాల సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సర్పంచులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు మోసీన్‌అలీ, జడ్పీటీసీ పుల్లెంల సైదులు, తాసీల్దార్ జమీరొద్దీన్, ఎంపీడీఓ దండ జితేందర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు మారుతి వెంకట్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

● తాసీల్దార్ సురేశ్‌కుమార్

అడవిదేవులపల్లి, జనవరి 17: నల్లగొండ- ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తాసీల్దార్ ఎస్. సురేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. గతంలో ఓటర్లుగా నమోదైన వారు, కొత్త వారు కూడా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నవంబర్ 1, 2023 వరకు డిగ్రీ పట్టా పొందిన వారు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఫిబ్రవరి 6వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ

నాంపల్లి : హనుమాన్ విగ్రహంతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

నార్కట్‌పల్లి, జనవరి 17: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను స్థానిక హిందూ వాహిని ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు.

హనుమాన్ విగ్రహ ఊరేగింపు

నాంపల్లి : అయోధ్య అక్షింతలకు మండల కేంద్రంలో అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ హనుమాన్ స్వామి విగ్రహంతో భక్తి పాటలు, మంగళ వాయిద్యాలతో గ్రామంలోని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుంభం కృష్ణారెడ్డి, కర్నాటి విద్యాసాగర్, వివిధ పార్టీల నాయకులు, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు కరువు భత్యం ప్రకటించాలి

● పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి

మిర్యాలగూడ, జనవరి 17: ఉద్యోగ, ఉపాధ్యాయులకు కరువు భత్యం ప్రకటించాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా సమావేశానికి వెళ్తూ మిర్యాలగూడలో కొద్దిసేపు ఆగి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల విద్యారంగ సమస్యలపై, పాఠశాలల బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారని, అందులో భాగంగా ఉపాధ్యాయుల సమస్యలను సైతం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను వర్తింప జేయాలన్నారు. అర్హాంతరంగా నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని, బదిలీ అయినప్పటికీ రిలీవ్‌కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, జీఓ నం.317 బాధిత ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, బ్లాక్ చేసిన 13 జిల్లాల స్పౌజ్ ఉపాధ్యాయ బదిలీలను చేపట్టాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వేతనాలను ట్రెజరీ ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేలను సారవంతం చేయడంపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నార్కట్‌పల్లి, జనవరి 17: దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పోతినేనిపల్లిలో బుధవారం వేస్ట్ డీ కంపోజర్‌ను క్షేత్ర స్థాయిలో తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ జొన్నల హరీశ్ మాట్లాడుతూ పత్తి పంట పైన వేస్ట్ డీకంపోజర్‌ను స్ప్రే చేసి దాని తర్వాత పంటను కలియ దున్నుకోవడం ద్వారా పత్తి కట్టె భూమిలోనే కుళ్లిపోయి నేల సారవంతం అవుతుందని తెలిపారు. పత్తి కట్టెలను కాల్చితే వాతావరణ కాలుష్యం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో దేశ్‌పాండే ఫౌండేషన్ సభ్యులు నాగయ్య, ప్రశాంత్, కె సుధాకర్, శ్రీధర్ రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హాలియా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేశ్

హాలియా, జనవరి 17 : హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళా అధ్యాపకురాలిని వేధించిన ప్రిన్సిపాల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఇంటర్‌బోర్డు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేశ్, జిల్లా శంకర్ ఆరోపించారు. బుధవారం హాలియాలో విలేకరులతో మాట్లాడుతూ తనను ప్రిన్సిపాల్ తనను వేధింపులకు గురి చేస్తున్నాడంటూ హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు పోలీసులతో పాటు ఇంటర్‌బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారని, ఇంటర్ అధికారులు విచారణ జరిపి రెండు నెలలు కావస్తున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. సదరు అధ్యాపకురాలికి మద్దతుగా నిలిచిన విద్యార్థులను సైతం ప్రిన్సిపాల్ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఇంటర్‌బోర్డు అధికారులు వెంటనే ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీశ్, చందు, ప్రవీణ్, అశోక్ పాల్గొన్నారు.

ఎంపీఎల్ కంపెనీ విస్తరణను నిలిపివేయాలని వినతి

చిట్యాల, జనవరి 17 : మండలంలోని వెలిమినేడు శివారులో ఎంపీఎల్ కంపెనీ విస్తరణను నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 19 నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను నిలిపి వేయాలని యువజన సంఘాలు, పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కలెక్టర్, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు బుధవారం వినతిపత్రాలను అందజేశారు. గ్రామానికి చెందిన ఆదర్శ యువజన సంఘం సభ్యులు, కొమ్మగోని భిక్షం, నాతి సతీశ్, నాతి రాజు కలెక్టర్, ఆర్డీఓ,కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామని బీఆర్ఎస్ వెలిమినేడు గ్రామ శాఖ అధ్యక్షుడు అరూరి శ్రీశైలం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు తుమ్మల నాగరాజురెడ్డి తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వెలిమినేడుకు చెందిన బైకాని నాగరాజు, నెల్లికంటి నర్సింహ రెడ్డి, ఏర్పుల శ్రీశైలం, దుర్గం లింగస్వామి, తాటికొండ రాజు, బైకాని మహేశ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న శ్యాంసుందర్‌రావు

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● బీజేపీ భువనగిరి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు

కట్టంగూర్, జనవరి 17 : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌రావు అన్నారు. మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో బుధవారం నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రం అమలు చేస్తున్న ఉజ్వల గ్యాస్, సుకన్య సమృద్ధి యోజన, ఆయుష్మాన్ భారత్, విశ్వకర్మ యోజన, పీఎం కిసాన్‌నిధి, ముద్ర రుణాలను అందజేస్తుందన్నారు. పేద ప్రజల కోసం మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు చేరువయ్యేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగిలయ్య, పార్టీ మండలాధ్యక్షుడు పబ్బు వెంకన్న, జిల్లా కార్యదర్శి మండల వెంకన్న, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌కుమార్, నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, జాయింట్ కన్వీనర్ ప్రభాకర్‌రావు, నాయకులు పసల సైదులు, ముడుసు భిక్షపతి, కోమటి భాస్కర్ వెంకటేశ్వరాచారి, కొమ్ము యాదయ్య పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

కసిరెడ్డి ధనలక్ష్మి

నిడమనూరు, జనవరి 17 : వివాహిత అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జె.గోపాల్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మార్లగడ్డ క్యాంపునకు చెందిన కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఉదయం కిరాణ సామాను తెచ్చేందుకు నిడమనూరు మండల కేంద్రానికి వెళ్లాడు. సామాన్లు తీసుకొని ఇంటికి వెళ్లేసరికి ఆయన భార్య కసిరెడ్డి ధనలక్ష్మి(45) ఇంట్లో లేక పోవడంతో బంధువుల ఇంటికి వెళ్లినట్లు భావించి రాత్రి వరకు ఎదురు చూశాడు. అయినా రాక పోవడంతో బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ కనిపించలేదు. దాంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎల్లాపురంలో హెడ్‌కానిస్టేబుల్ భారతి అంత్యక్రియలు

● నివాళులర్పించిన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, పోలీసు అధికారులు

గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

తిరుమలగిరి(సాగర్), జనవరి 17: రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ భారతి అంత్యక్రియలు బుధవారం ఆమె స్వగ్రామం మండలంలోని ఎల్లాపురంతండాలో నిర్వహించారు. గ్రామంలో ఆమె మృతదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, ఎస్ఐ సురేశ్, గ్రామస్తులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వేములపల్లి, జనవరి 17 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకొని సీజ్ చేసినట్లు ఏఎస్ఐ నరసింహారావు తెలిపారు. మిర్యాలగూడ మండలం కాల్వపల్లికి చెందిన ధీరావత్ పద్మ, దుండిగల వీరస్వామికి చెందిన ట్రాక్టర్ల ద్వారా ప్రభుత్వ అనుమతులు లేకుండా రావులపెంట మూసీ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో రావులపెంట గ్రామ శివారులో ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి, యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.